
సాక్షి
గుంటూరు
మంగళవారం । 22 । జూలై । 2025



అమ్మవారికి ఆషాఢ సారె

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి భక్తులు సోమవారం సారె సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 568.30 అడుగులకు చేరింది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గుంటూరులో భారీ వర్షం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయం కావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

రియల్ ఢమాల్!

ప్రభుత్వ వైఖరితో రాజధానిలో నిలిచిపోయిన భూముల క్రయవిక్రయాలు

- నాలుగు నెలల కిందట ఆకాశాన్నంటిన ప్లాట్లు, పొలాల ధరలు
- భూముల కొనుగోళ్లు, అమ్మకాలతో అంతటా సందడే సందడి
- అమరావతిలో భూములు విక్రయించి మరో ప్రాంతంలో కొనుగోలు
- రాజధానికి మరో 45 వేల ఎకరాలు కావాలని చంద్రబాబు పట్టు
- నెల రోజుల నుంచి స్తంభించిపోయిన స్థిరాస్తి కార్యకలాపాలు
- గోళ్లు గిల్లుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లు
- రెండో దశ పూలింగ్‌పై ప్రభుత్వ ప్రకటనతో అందరిలో ఆందోళన
- రాజధానిలో ప్లాట్లు, పొలాల కొనుగోలుకు ముందుకురాని ప్రజలు

రాజధాని నిర్మాణం పేరుతో 11 ఏళ్ల కిందట తీసుకున్న భూములకు సంబంధించిన రైతులకు ఇప్పటికీ ఇచ్చిన ప్లాట్లు కాగితాలపైనే ఉన్నాయి. ఎకరం పొలం తీసుకుని చేతిలో పెట్టిన 1,200 గజాలు కాగితాలకు కనీసం బ్యాంకర్లు కూడా రుణాలు ఇవ్వడం లేదు. ఈ పరిస్థితుల్లో మూలిగే నక్కపై తాడిపండు పడినట్లుగా మరో 45 వేల ఎకరాలు రాజధాని నిర్మాణం కోసం సేకరిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఆయా ప్రాంతాల రైతులకు ఇది మింగుడు పడటం లేదు. ఈ ప్రభావం రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్రంగా పడింది. కొత్తగా కొనేవారు లేక భూ లావాదేవీలు స్తంభించిపోయాయి.



సాక్షి ప్రతినిధి, గుంటూరు, తాడికొండ, పెదకాకాని: రాజధాని ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే భూముల ధరలు రూ. కోట్లకు పడగలెత్తుతాయని ఆశ, ఆరాటంతో ఓటు వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అందులో ఎకరం అమ్ముకొని సొమ్ము చేసుకొని వేరే ప్రాంతంలో భూమి కొనుగోలు చేద్దామని ఆశతో బేరం పెట్టారు. ఎకరం అమాంతంగా రూ.3 కోట్ల నుంచి రూ. 4 కోట్ల వరకు అడుగుతుండటంతో అమ్మో అప్పుడే అమ్మితే ఎలా అని రోజుకో రకంగా పెరుగుతున్న రియల్ ఎస్టేట్ రంగాన్ని చూస్తూ మురిసిపోతూ కాలం వెళ్లబుచ్చారు. ఇప్పుడు పరిస్థితి పూర్తి విరుద్ధంగా మారింది. ఇక మరో రైతు ప్రభుదాసు తమవారు తరాలుగా కష్టపడి సంపాదించి ఇచ్చిన అర ఎకరం పొలం విక్రయిద్దామని బేరం పెట్టారు. రూ.3 కోట్లకు 1/3వ వంతు నగదు తీసుకొని 3 నెలల తరువాత రిజిస్ట్రేషన్ చేసుకుందామని అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ డబ్బుతో మరో ప్రాంతానికి వెళ్లి ఎకరం రూ.35 లక్షల చొప్పున కొనుగోలు చేసి, అగ్రిమెంట్ చేసుకున్నారు. ఇలా ఎందరో రైతులు రాజధాని ప్రాంతంలో తమ భూములను అమ్మకాలు, కొనుగోళ్ల సందడితో మురిసిపోయారు. కూటమి ప్రభుత్వం ఉన్నట్టుండి రెండు నెలల క్రితం అదనపు భూ సమీకరణ చేపట్టనున్నట్లు ప్రకటించింది. దీంతో రైతుల గుండెల్లో బాంబు పడినట్లైంది.

ఒక్కసారిగా నిస్తేజం

రెండో విడత భూ సమీకరణ పేరుతో అమరావతి, తుళ్ళూరు మండలాల్లో గ్రామ సభలు నిర్వహించిన ప్రభుత్వం తొలుత 45 వేల ఎకరాలను సమీకరణ చేస్తున్నట్లు ప్రకటించింది. తదనంతరం సభలను విస్తరించి తాడికొండ మండలంలో కూడా చేపట్టడంతో రైతులు మండిపడ్డారు. ఉన్నట్టుండి విరుచుకుపడటంతో ప్రభుత్వం ఓ అడుగు వెనక్కేసింది. కానీ నిన్న మొన్నటి వరకు రూ. కోట్లలో పలికిన భూముల ధరలు మాత్రం ఆకాశం నుంచి కుప్పకూలిన చందంగా ఒక్కసారిగా పడిపోయాయి. అమ్ముకొని సొమ్ము చేసుకున్న రైతుల ఆనందం అంతా ఇంతా కానప్పటికీ అగ్రిమెంట్‌ల రూపంలో ఉన్న రైతులు, అప్పుల పాలై అమ్ముకుందామని ఎదురు చూస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఎప్పుడూ సందడిగా ఉండే రియల్ ఎస్టేట్ ఆఫీసులు వెలవెలబోతున్నాయి. అదే తరహాలో పెదకాకాని రిజిస్ట్రార్ కార్యాలయంలో కూడా రిజిస్ట్రేషన్‌ల సంఖ్య తగ్గిపోయింది.



పెదకాకానిలో వెలవెలబోతున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపార దుకాణం

సొంత పార్టీ నేతల తిరుగుబాటు

నిన్న మొన్నటి వరకు బ్రహ్మాండమైన రాజధాని నిర్మించి ప్రపంచంలోనే గొప్పగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారంటూ ప్రగల్భాలు పలికిన సొంత పార్టీ నేతలే నేడు తిట్ల దండకం అందుకుంటున్నారు. బాబును నమ్మితే నట్టేట ముంచారని, నమ్ముకున్నవాడిని మోసం చేయడం అంటే ఇదేనని వాపోతున్నారు. చెప్పిన మాటకు కట్టుబడి ఉన్న భూముల్లో రాజధాని నిర్మిస్తే సరేసరి.. లేదంటే మరో ఉద్యమం తప్పదన్నారు. ఇప్పటికే భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు సైతం ఇవ్వలేదు, ఇచ్చిన వారికి ప్లాట్లు భౌతికంగా ఎక్కడున్నాయో కూడా తెలియదు. ఇంకా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి కాలేదు. అభివృద్ధి చేసి 10 సంవత్సరాల్లో ప్లాట్లు తిరిగిస్తానన్న బాబు విదేశీ పర్యటనలు, అదనపు భూ సమీకరణ పేరుతో రైతులను పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఏడాదిన్నర పూర్తయింది. రాజధానిలో ఏవేవో కడతానని చెప్పడం మినహా పునాదులను సైతం అడుగు కూడా పైకి లేపిన దాఖలాలే లేవు.

కొనేవారు రావడం లేదు



భూములు కొనుగోలు చేసేవారు రావడం లేదు. ప్రభుత్వం మళ్లీ భూ సమీకరణ ప్రకటన చేసినప్పటి నుంచి వ్యాపారాలు సాగడం లేదు. పదేళ్లుగా ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ చేస్తున్నాను. గతంలో ప్లాట్లు, పొలాలు కొనుగోలు చేసేందుకు వచ్చే వారికి చుట్టుపక్కల ప్రాంతాల్లో చూపించేవారం. అందుకు ప్రతిఫలంగా వారు కమీషన్ ఇచ్చేవారు. కొనేవారు ఇప్పుడు రాకపోవడంతో వ్యాపారాలు నిలిచిపోయాయి.

– షేక్ మస్తాన్, రియల్ ఎస్టేట్ వ్యాపారి, పెదకాకాని

స్థిరాస్తి రంగం కుదేలు



కూటమి ప్రభుత్వం రాజధాని పేరుతో మళ్లీ భూములు సమీకరిస్తుండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. అమ్మేవారు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనేవారు లేకపోవడంతో వ్యాపారం ఆగిపోయింది. నెల రోజులకు ముందు చేసుకున్న అగ్రిమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్‌లు అవుతున్నాయి. ఈ నెలలో ఒక్క బేరం కూడా జరగలేదు. భూములు కావాలని వచ్చేవారు తగ్గిపోయారు. ప్రభుత్వం భూ సమీకరణపై స్పష్టత ఇవ్వాలి.

– పాటిబండ్ల సంగీతరావు, రియల్ ఎస్టేట్ వ్యాపారి, పెదకాకాని

అప్పు కూడా పుట్టక అవస్థలు

అదనపు భూ సమీకరణ ఊసు లేనప్పుడు రాజధాని ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రాంతాన్ని బట్టి గజం రూ.40 వేలు నుంచి రూ.80 వేలు పలికిన భూముల ధరలు ఇప్పుడు కొనేందుకు వ్యాపారులు, ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ఆ భూమిని కనీసం బ్యాంకులో అయినా తనఖా పెట్టుకొని అప్పు తీసుకుందామా అంటే అధికారులు ఒప్పుకోవడం లేదు. దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో తుళ్ళూరు రాజధాని ఉంటే పెదకాకాని మండల శివారులో ఉన్న మంగళగిరి రూరల్ మండలం కాజ, తాడికొండ మండలంలోని కంతేరు గ్రామం వరకూ భూములు సేకరిస్తారని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కనీసం తమ అవసరానికి కూడా విక్రయించలేక పోతున్నామని, ఎక్కడా అప్పు కూడా పుట్టడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వ్యాపార ధోరణి విడనాడి స్పష్టమైన విధానం ప్రకటించాలని వారు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ఉపకారవేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో భాగంగా 2024 డిసెంబర్‌లో జరిగిన పరీక్షలో ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 31వ తేదీ లోగా స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు తమ వివరాలను www.rchoarrhipr.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసి దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. విద్యార్థి తన వివరాలలో ఏ ఒక్క అక్షరం తేడాగా నమోదు చేసినా స్కాలర్‌షిప్ మంజూరు చేయబడదని స్పష్టం చేశారు. మెరిట్ లిస్ట్‌లో ఉన్న విధంగా ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. నమోదు చేసిన దరఖాస్తును జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందచేయాలన్నారు. ఈఏడాది 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. రెన్యువల్ చేయని విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాదని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గణిత, రసాయనశాస్త్ర అధ్యాపక పోస్టులను అతిథి అధ్యాపకులతో భర్తీ చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బి.ఉమాదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధించి సబ్జెక్టు పీజీలో 55 శాతం మార్కులు పొంది ఉండాలని, ఎంపిక ప్రక్రియ డెమో ద్వారా నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 24లోపు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 26న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

వైద్య అధికారులతో డీఎంహెచ్‌ఓ సమావేశం



గుంటూరు మెడికల్: డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన గుంటూరు జిల్లాలో ఏప్రిల్ 25 – జూన్ 25 వరకు జరిగిన 8 శిశు, చంటి పిల్లల మరణాలపై రివ్యూ కమిటీ సమావేశం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. మరణాలకు కారణాలు, అందించిన వైద్య సేవలు, గృహ సందర్శనలు వివరాలపై చర్చించారు. గుంటూరు నగరంలోని బొంగరాలబీడు, మారుతీనగర్, పొన్నెకల్లు ఆరోగ్యకేంద్రాల పరిధిలో నమోదైన కేసులపై ఆరా తీశారు. సమావేశంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాలు అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు డాక్టర్ దేవకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భవాని, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్ సభ్యులు డాక్టర్ ఎస్.రాధామాధవి, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ఈవోఐసీడీఎస్ సుబ్బమ్మ, ఐద్వా ఎన్జీవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు విడుదల

తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురియడంతో పలు వాగులు నుంచి వరదనీరు ప్రకాశం బ్యారేజ్ వద్దకు చేరింది. సోమవారం సాయంత్రం స్వల్పంగా వరదనీటిని ప్రకాశం బ్యారేజ్ దిగువ ప్రాంతానికి విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజ్ జేఈ రమేష్ మాట్లాడుతూ ప్రకాశం బ్యారేజ్ వద్దకు మున్నేరు ఇతర వాగుల నుంచి 5,300 క్యూసెక్కులు చేరిందని, ప్రకాశం బ్యారేజ్ వద్ద నీటిమట్టాన్ని 12 అడుగులు మెయింటెన్ చేస్తూ విజయవాడ వైపు ఒక అడుగు మేర 4 గేట్లు ఎత్తి కృష్ణానది దిగువకు 2900 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని తెలిపారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 2522 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన తెలిపారు.

కందకంలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు



తాడికొండ: ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కందకంలోకి దూసుకెళ్లిన ఘటన తాడికొండ శివారు పెదపరిమి రోడ్డులో జరిగింది. సోమవారం మధ్యాహ్నం సుమారు 30 మంది ప్రయాణికులతో గుంటూరు వైపు నుంచి తుళ్ళూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు తాడికొండ దాటిన తరువాత కందకంలోకి దూసుకెళ్లింది. ఇద్దరు మహిళలతోపాటు పలువురు పురుషులకు తీవ్ర గాయాలయ్యాయి. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా ట్రాఫిక్ డైవర్షన్‌తో ఆలస్యమైతే తమకు మెమోలు ఇస్తున్నందునే స్పీడుగా వెళుతున్నామని డ్రైవర్‌లు చెబుతున్నారు. కొన్ని పాయింట్లలో బస్సులు ఆపడం లేదని కూడా ఫిర్యాదులు వస్తున్నాయి.

టెండర్లన్నీ కొట్టేసి.. పనుల్లో నొక్కేసి..

- టీడీపీకి చెందిన ఓ సామాజిక వర్గానికి చెందిన కాంట్రాక్టర్లకే వర్కులు
- బయట వ్యక్తులు టెండర్లలో పాల్గొంటే వెనక్కి తీసుకోవాలని బెదిరింపులు
- ఒక్క కాంట్రాక్టర్ వద్దే దాదాపు 30 నుంచి 40 వరకు వర్కులు
- రూరల్ పరిధిలో పనులన్నీ తమకేనంటూ ఓ షాడో కార్పొరేటర్ హుకుం
- నాసిరకంగా పనులు చేస్తూ జేబులు నింపుకొంటున్న 'పచ్చ బ్యాచ్'
- తూతూమంత్రంగా నాణ్యత నియంత్రణ నివేదికలిస్తున్న అధికారులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గత నెలలో 269 వర్కులకు ఇంజినీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారు. ఎక్కువ లాభాలు వచ్చే వర్కులకు టీడీపీకి చెందిన తమ సామాజిక వర్గానికి చెందిన వారే పాల్గొనాలని కొంత మంది టీడీపీకి చెందిన బడా కాంట్రాక్టర్లు నిర్ణయించారు. ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారిని బహిరంగంగానే బెదిరించడంతో కొంత మంది వెనుదిరిగారు. దీనిపై గత నెలలో 'సాక్షి' దినపత్రికలో పలు కథనాలు రావడంతో టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లు వెనక్కు తగ్గారు. అయినప్పటికీ టెండర్ సమయానికి తమకు అనుకూలమైన వర్కుల్లో ఎవరెవరు టెండర్లు వేశారో వారిని పాలకులు, అధికారులు పిలిపించారు. వారి చేత టెండర్లు రద్దు చేయించారని ఇతర సామాజిక వర్గానికి చెందిన కాంట్రాక్టర్లు బహిరంగ ఆరోపణలు చేస్తున్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం

ఎమ్మెల్యే చెబితే నేను చేయాలా..?

గత నెలలో జరిగిన టెండర్ల ప్రక్రియలో టీడీపీకి చెందిన ఒకే సామాజిక వర్గానికి చెందిన 10 మంది కాంట్రాక్టర్లు అధిక లాభాలు వచ్చే వర్కులను పంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ కాంట్రాక్టర్ 30 నుంచి 40 వర్కులు దక్కించుకున్నారంటే అధికారులు, పాలకులు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. తీరా వర్కులు దక్కించుకున్న వారు సకాలంలో ప్రారంభించడం లేదు. రూ.కోట్ల విలువైన పనులు ప్రారంభించకున్నా అధికారులు వారిపై ఒత్తిడి తీసుకురావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల నగరంలో ఓ ప్రాంతానికి చెందిన వర్కులను నెలల తరబడి చేయకపోవడంతో ఎమ్మెల్యే ప్రారంభించాలని చెప్పినా ఫలితం లేకుండాపోయింది. 'ఎమ్మెల్యే చెబితే నేను చేయాలా... నాకు నచ్చినప్పుడు చేస్తానని' కాంట్రాక్టరు చెప్పడంతో మిగిలిన వారు కూడా షాకయ్యారు.

రూరల్ పరిధిలో షాడో కార్పొరేటర్ హవా

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో విలీనమైన గ్రామాల్లో ఓ షాడో కార్పొరేటర్ పెత్తనం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ గ్రామంలో జరిగే ప్రతి వర్కును తానే చేయాలని పట్టుబడుతున్నారు. ఒక వేళ ఎవరైనా టెండర్లలో పాల్గొంటే బిల్లు రానివ్వకుండా చేస్తారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై కొంతమంది కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు..

నగరంలో చేపట్టే ప్రతి వర్కుకి బిల్లు ప్రాసెస్ అవ్వాలంటే థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ రిపోర్ట్ అవసరం. టీడీపీకి చెందిన ఆ సామాజిక వర్గానికి కాంట్రాక్టర్లు అధికంగా చేస్తున్న వర్కుల్లో నాణ్యతా ప్రమాణాలు లేవు. పైపైన పనులు చేసుకుంటూ వెళుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. నగరంలో ఇటీవల పూర్తయిన ఓ వర్కుకు రోడ్డు నిర్మాణానికి వాడాల్సిన మెటీరియల్ కన్నా తక్కువ వినియోగించడం గమనించారు. ఈ విషయం రోడ్ కోర్ కటింగ్‌లో తేలింది. అయితే ఆ రిపోర్టును అధికారులు బయటకు రానివ్వకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వర్కులు చేసేది మన కాంట్రాక్టర్లే కదా... కొంచెం చూసీచూడనట్లు పోవాలని థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోలర్ పరిశీలకులకు అధికారులు ఉచిత సలహాలు ఇస్తున్నట్లు తెలిసింది.

అర్జీలపై నిర్లక్ష్యంగా ఉంటే షోకాజ్ నోటీసులు



అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కొన్ని అర్జీలు వివిధ శాఖలు సమన్వయంతో పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిని ఉపేక్షించనని చెప్పారు. కోర్టు కేసులకు సంబంధించి సమాధానాలు నిర్ణీత గడువులోనే దాఖలు చేయాలన్నారు. అధికారులు అవసరమైన మేరకు లీగల్ టీమ్ సహాయం తీసుకోవాలన్నారు. మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ప్రజలు అర్జీలు ఇవ్వొచ్చన్నారు. 368 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

ఇబ్బంది పెడుతున్న ఆర్టీసీ అధికారి

నేను ఎంతో కాలంగా ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. సుమారు 60 ఏళ్లు సమీపిస్తున్నా నాపై వివక్ష చూపుతున్నారు. డ్యూటీ చేసినా ఆబ్సెంట్ వేస్తున్నారు. తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారు. దయచేసి విచారించి తగు చర్యలు తీసుకోగలరు.

– తోట వేణుగోపాలరావు, ఆర్టీసీ కండక్టర్

పంచాయతీలకు నిధులు విడుదల చేయండి

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలి. గత డిసెంబర్‌లో కేంద్రం కొంత విడుదల చేసినా, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. 7 నెలల నుంచి పంచాయతీలు నిధుల లేమితో ఇబ్బంది పడుతున్నాయి. గ్రామాల్లో అన్ని అభివృద్ధి పనులు కుంటుపడ్డాయి.

– జాస్తి వీరాంజనేయులు, అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షుడు

దుష్టపాలన అంతానికి పోరాటం

- చంద్రబాబు, లోకేశ్‌లకు బుద్ధి చెప్పి తీరుతాం
- వైఎస్సార్ సీపీ నాయకులందరిపై అక్రమ కేసులు పెడుతున్నారు
- ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారు
- మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని
- పోలీసు ఆంక్షలు మీరినట్టు నమోదైన అక్రమ కేసులో విచారణకు హాజరు

సత్తెనపల్లి: రాష్ట్రంలో దుష్ట పాలన అంతానికి అలుపెరగని పోరాటం చేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మాజీ మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల పర్యటన సందర్భంగా పోలీసు ఆంక్షలు ఉల్లంఘించారంటూ నమోదైన అక్రమ కేసులో విచారణకు అంబటి, రజినిలు సోమవారం హాజరయ్యారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నేతలు, మాజీ మంత్రులపై సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని, కుట్రపూరితంగా అక్రమ కేసుల్లో ఇరికిస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసుస్టేషన్లకు తిప్పి వేధించి భయపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఎప్పుడూ ఇలాంటి కేసులు పెట్టలేదని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు తమ పార్టీ కార్యక్రమాలకు సత్తెనపల్లి వచ్చి బలప్రదర్శన చేశారని, అప్పుడు తాము వారిపై ఎలాంటి కేసులూ పెట్టలేదని అంబటి పేర్కొన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారని విమర్శించారు.

రాజ్యాంగేతర శక్తిగా డీఎస్ఆర్

సత్తెనపల్లిలో కాంట్రాక్టర్ దరువూరి నాగేశ్వరరావు (డీఎస్ఆర్) రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నాడని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు విమర్శించారు. నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసిందేమో ఎమ్మెల్యేకి, చేతులు కట్టుకుని నిలుచునేదేమో కాంట్రాక్టర్ దగ్గర..! ఇదెక్కడ విడ్డూరన్నారు. సదరు డీఎస్ఆర్ సత్తెనపల్లిలో ఉన్న స్థలాలన్నీ ఆక్రమించుకుంటున్నాడని, వివాదాల్లో ఉన్న స్థలాలను ప్లాట్లుగా మారుస్తూ సొమ్ము చేసుకుంటూ ఉన్నాడన్నారు.

కూటమి హయాంలో వీధికో బెల్టుషాపు

సత్తెనపల్లిలో నాలుగు బార్లు ఉన్నాయని, వైఎస్సార్ సీపీలో ఆ బార్లు బిడ్‌లు వేసి తీసుకున్నారన్నారు. ఇవాళ వాటిలో ముగ్గురు ఓనర్లు లేరని, డీఎస్ఆర్ ఎవరిని చెబితే వారిని పెట్టారన్నారు. ఓనర్లను తరిమేశారని, ఇంతకన్నా దారుణం ఉండదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు, మేం మంత్రులుగా ఉన్నప్పుడు ఎక్కడైనా బెల్టుషాపులు ఉన్నాయా అని ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్ చంద్రబాబు, డీఎస్ఆర్, లోకేష్‌లు కలిసి చేస్తున్నారని, మంత్రులంతా డబ్బులు వసూలు చేసుకునే కార్యక్రమం చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి విడదల రజిని, సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి, గుంటూరు మిర్చియార్డు మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షురాలు రోళ్ల మాధవి ఉన్నారు.

ఏడాదిగా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

జనం గుండెల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిర స్థానం సంపాదించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని చెప్పారు. వైఎస్ జగన్ పర్యటనకు ఎవరినీ పిలవాల్సిన అవసరం లేదని, ఆయన వస్తున్నారంటే ప్రజలే స్వచ్ఛందంగా తరలివస్తారని, గత నెల 18న జనం ఎలా తరలి వచ్చారో అంతా చూశారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే తీవ్ర ప్రజావ్యతిరేకత మూటగట్టుకుందని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని, పక్కన మాజీ మంత్రి అంబటి రాంబాబు



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 475

కొమ్ములు : 274 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
	(ధర రూ॥ల్లో)	
8,750	10,500	10,385

కాయలు : 201 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,750	10,500	10,385

మొత్తం అమ్మకాలు : 356.256 క్వింటాళ్లు

-దుగ్గిరాల

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 1,000 గరిష్టం : రూ. 1,500

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	47,858
అమ్మకాలు	44,971
నిల్వ	6,252

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,000
నంబరు–5	10,000–13,400
341	10,000–13,600
సూపర్ –10	10,000–13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–12,500
నంబరు–5	10,000–13,600
341	10,000–13,500
4884	10,000–12,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,000
బాడిగ–355	10,000 – 12,300
దేవనూరు డీలక్స్	10,000 – 12,500
ఆర్మూర్	9,600 – 10,800
తాలుకాయలు	5,000 – 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–13,800
బాడిగ – 355	10,000–12,700
దేవనూరు డీలక్స్	10,000 – 12,600
తాలు	5,200 – 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

తక్కువ ధరకే

బంగారం ఇప్పిస్తామంటూ మోసం

- ఎస్పీ సతీష్‌కుమార్‌కు బాధితుల ఫిర్యాదు
- ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాల వేదికలో అర్జీల స్వీకరణ

నగరంపాలెం: తక్కువ ధరకే బంగారు అభరణాలు ఇప్పిస్తామని మోసగించారని కొందరు, క్రెడిట్ కార్డులు ద్వారా రూ.లక్షల్లో కాజేశారని మరికొందరు బాధితులు వేర్వేరుగా జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కారాల వేదికలో ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదిదారుల మొరను జిల్లా ఎస్పీ ఆలకించారు. అర్జీదారుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), రవి కుమార్ (ఎల్/ఓ), హనుమంతు (ఏఆర్), మహిళా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి వినతులు స్వీకరించారు.



బాధితుల మొరను ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ఇల్లు రాసివ్వడం లేదు..

సుమారు రెండున్నరేళ్ల కిందట ఇల్లు విక్రయిస్తామని చెప్పగా, దశల వారీగా రూ.16 లక్షలు చెల్లించాను. గతేడాదిలో ఇంటి యజమానురాలు మృతి చెందింది. దీంతో మిగతా రూ.14 లక్షలు చెల్లిస్తాను, ఇల్లు రిజిస్ట్రేషన్ చేయాలని ఈ ఏడాది మార్చిలో ఆమె కుటుంబ సభ్యులను అడగ్గా నిరాకరించారు. దీంతో ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. వారి నుంచి ప్రాణహాని ఉంది. న్యాయం చేయగలరు.

– షేక్ సర్తాజ్‌బేగం, చిన్నబజార్, లాలాపేట

సుమారు రూ.40 లక్షల మేరకు నష్టపోయాం...



పెదకాకానిలో ఉంటున్న ఓ మహిళ పరిచయమైంది. తక్కువ ధరకే బంగారపు వస్తువులు ఇప్పిస్తానని తెలిపింది. రాజకీయ నేతలు బాగా తెలుసునని, గతంలో ఒకరిద్దరికి బంగారం ఇప్పించానని నమ్మించింది. మొబైల్‌ఫోన్‌లో బంగారు ఉంగరాలు, గొలుసులు ఇతరత్రా అభరణాలపై ఆశ చూపించేది. ముందుగా రూ.5 లక్షలు పెట్టుబడి రూపంలో చెల్లించాలని షరతులు విధించింది. దీంతో ఇంట్లో వస్తువులు తనఖా పెట్టి, తెలిసిన బంధువుల వద్ద అప్పులు చేసి రూ.పది లక్షలు చెల్లించినట్లు నాగదుర్గ తెలిపింది. ఓ ప్రైవేటు కంపెనీలో డేటా ఆపరేటర్‌గా పనిచేస్తూ, రూ.ఐదు లక్షలు చెల్లించినట్లు మోహన్ నరసింహ కృష్ణ తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తూ రూ.10 లక్షలు చెల్లించినట్లు మరో బాధితురాలు తెలిపింది. సుమారు ఆమె వద్ద నుంచి రూ.40 లక్షల వరకు రావాల్సి ఉందని బాధితులు తెలిపారు. నెలలో బంగారం ఇప్పిస్తానని ప్రలోభాలు పలికిన ఆమెను పలుమార్లు అడిగినా సరైన సమాధానం లేదు. ఆరు నెలలు గడిచినా బంగారపు ఆభరణాలు ఇవ్వకపోగా.. అడిగితే బెదిరింపులకు పాల్పడుతోంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. మాకు న్యాయం చేయగలరు.

– జె.నాగదుర్గ, కె.మోహన్ నరసింహ కృష్ణ, అరిఫా, ఓల్డ్‌క్లబ్ రోడ్డు, కొత్తపేట

క్రెడిట్ కార్డులు తీసుకుని...



ప్రైవేటుగా గృహ రుణాలు ఇప్పిస్తుంటాను. మంగళగిరి రోడ్డులోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేసే వ్యక్తి పరిచయమయ్యారు. ప్రైవేటు బ్యాంక్‌లో రెండు క్రెడిట్ కార్డులను మా పేరిట ఆ వ్యక్తి తీసుకుని, వాడుకున్నాడు. రెండు నెలల్లో చెల్లిస్తానని వాడుకున్న రూ.15 లక్షలు చెల్లించలేదు. సుమారు ఏడాదిన్నర గడిచింది. ఈ ఏడాది జనవరిలో అతనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. క్రెడిట్ కార్డులు దుర్వినియోగం చేసిన తీరు, స్టేట్‌మెంట్‌లను పోలీసులకు అందజేశా. ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాం.

– బి.రాధాకృష్ణ, సుజాత, బ్రాడీపేట

తెలియకుండా నగదు డ్రా..



గతంలో చెన్నైలో ఉన్నా. భర్త అనారోగ్యంతో మృతిచెందగా, స్వస్థలానికి వచ్చాను. అయితే భర్త మృతికి సంబంధించి బీమా నగదు రూ.6.72 లక్షలు బ్యాంక్ ఖాతాలో జమచేశారు. ఆ నగదు డ్రా చేయడం తెలియకపోవడంతో సమీప బంధువైన కుర్రాడ్ని తీసుకువెళ్లేవాడ్ని. తమకు తెలియకుండానే రూ.13.73 లక్షలు అతను డ్రా చేశాడు. తద్వారా ఆ మొత్తాన్ని రమ్మీ ఆటలో పెట్టేవాడని బ్యాంక్ స్టేట్‌మెంట్ ద్వారా తెలిసింది. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదు. ఆఖరికి జిల్లా పోలీస్ కార్యాలయంలో మూడుసార్లు అర్జీలిచ్చినా ప్రయోజనం లేదు. ఓ పోలీస్ అధికారి మాట్లాడిన తీరు బాగోలేదు. వృద్ధాప్యంలో ఉన్న తమకు నగదు ఇప్పించగలరని కోరుతున్నా.

– ముక్కామల స్వాతి, మారీసుపేట, తెనాలి.

ఉద్యోగం ఇప్పిస్తానని...

ఏడేళ్లుగా ఓ హోటల్‌లో పార్ట్‌టైం పనిచేస్తుంటాను. రెండేళ్ల కిందట ఓ వ్యక్తి పరిచయమయ్యారు. ప్రజాప్రతినిధులతో కలిసి దిగిన ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌నకు పంపించేవాడు. జీఎంసీ లేదా, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్ శాఖలో ప్రభుత్వం ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఓ ప్రైవేటు బ్యాంక్ ద్వారా రుణం తీసుకుని రూ.2 లక్షలు చెల్లించాను. ఆ తర్వాత మొబైల్ స్విచ్చాఫ్ చేయగా, ఇంటి వద్దకు వెళ్లి అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారు. న్యాయం చేయగలరు.

– మహేష్, బ్రాడీపేట 5/2వ అడ్డరోడ్డు.

పీ–4 పథకంపై అధికారులు దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: జిల్లాలో ప్రజలు, ప్రభుత్వం, దాతల భాగస్వామ్యంతో కూడిన పీ–4 పథకానికి సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బంగారు కుటుంబాల గుర్తింపు, మ్యాపింగ్ ప్రక్రియను అధికారులు ప్రత్యేక శ్రద్ధతో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పీ–4 అమలు అయితే ఎన్నో పేద కుటుంబాలకు ఆసరాగా ఉంటుందన్నారు. పీ4 నీడ్ అసెస్‌మెంట్ సర్వేను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో లే–అవుట్లలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 11049 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించగా, వాటిలో 50 శాతం మాత్రమే పూర్తయ్యాయన్నారు. మిగిలిన గృహాలు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పంటగుంతలు, కంపోస్టు కిట్‌లు, పశువుల పాకలు నిర్దేశించిన లక్ష్యాల మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈలకు నైపుణ్యాభివృద్ధికి ఇతర మార్కెటింగ్ అంశాలకు సంబంధించి పరిశ్రమల శాఖ మండల స్థాయిలో నిర్వహించే వర్క్‌షాపులు సక్రమంగా నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రతివారం డ్రైడేను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, సీపీఓ శేషశ్రీ, డీపీఓ సాయికుమార్, హౌసింగ్ పీడీ ప్రసాద్, డ్వామా పీడీ శంకర్, పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

జీవన ఎరువుల వాడకంతో భూమి భద్రం

గుంటూరు వెస్ట్: వ్యవసాయ రంగంలో సమగ్ర భూసార సంరక్షణ పద్ధతి ఎంతో ముఖ్యమైనదని, దీని వలన భూమి భద్రంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయంలో సేంద్రీయ ఎరువుల వాడకంతోపాటు జీవన ఎరువులు (బయో ఫర్టిలైజర్స్) వాడకం కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయన్నారు. జీవన ఎరువులు భూమిలో వేసినప్పుడు వాటిలో ఉన్న సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి మొక్కలు చురుగ్గా పెరగడానికి వివిధ పోషకాలతోపాటు అవసరమైన హార్మోన్లు, విటమిన్లు అందుతాయన్నారు. వీటి వాడకంతో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవడంతోపాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. భూమి కూడా పాడవకుండా ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ పొడి రూపంలో లభిస్తున్న జీవన ఎరువులకన్నా ద్రవ రూపంలో లభించే జీవన ఎరువులు ఎక్కువ కాలం నిల్వ ఉండి మెరుగ్గా పనిచేస్తాయన్నారు. జీవన ఎరువులు లాంఫాంలోని ఏరువాక కేంద్ర వద్ద, అమరావతిలోని జీవన ఎరువుల పరిశోధనా కేంద్రం వద్ద లభిస్తాయని తెలిపారు. అనంతరం జీవన ఎరువుల ఉపయోగాలతో కూడిన పోస్టర్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, సీపీఓ శేషశ్రీ జిల్లా అధికారులు ఆవిష్కరించారు.

ఏఎన్‌యూ విద్యార్థికి జపాన్ వర్సిటీ ఆహ్వానం

పెదకాకాని(ఏఎన్‌యు): జపాన్ దేశంలోని క్యోటో యూనివర్సిటీలో ఫెలోషిప్ కింద అధ్యయనం చేసేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎంఎస్సీ ఫారెస్ట్రీ కోర్సు విద్యార్థి వి అవినాష్‌కు అవకాశం లభించింది. ఈ మేరకు జపాన్ యూనివర్సిటీ నుండి ఏఎన్‌యూకి అధికారికంగా ఆహ్వాన పత్రం అందింది. ఈ ఆహ్వాన పత్రాన్ని వీసీ ఆచార్య కె గంగాధరరావు సోమవారం విద్యార్థి వి అవినాష్‌కు అందజేశారు. అవినాష్ మూడు నెలల పాటు జపాన్ క్యోటో యూనివర్సిటీలో ప్రొఫెసర్ యోసుకే ఒనాడ కింద ఫెలోషిప్‌లో భాగంగా ఫారెస్ట్ ఎకాలజీ ల్యాబొరేట్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌లో పనిచేయనున్నారు. దీనిలో భాగంగా ఫారెస్ట్ ప్రొడెక్టివిటీ ఎకోసిస్టమ్ ప్రాసెస్ తదితర అంశాల మీద పరిశోధన చేయనున్నారు. జపాన్ యూనివర్సిటీలో మంచి అధ్యయనం చేసి అంతర్జాతీయ ఖ్యాతి గడించాలని అవినాష్‌కు వీసీ సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్రీ కోర్సు విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున, అధ్యాపకులు డాక్టర్ మిథున్ కుమార్, డాక్టర్ ఆర్. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాన్ని అవినాష్‌కు అందజేస్తున్న వీసీ

సీపీఐ గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్
- మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

లక్ష్మీపురం: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుంటూరు జిల్లా 26వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు కొత్తపేటలోని పార్టీ జిల్లా కార్యాలయం (మల్లయ్య లింగం భవన్)లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభలు ఆగస్టు 4,5 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 4న మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు బీఆర్ స్టేడియం నుంచి గాంధీ పార్క్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామని చెప్పారు. సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సహా రాష్ట్ర, జిల్లా పార్టీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. 5న ప్రతినిధుల సభను మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహిస్తామని తెలిపారు. మూడు సంవత్సరాల కాలంలో జిల్లాలో పార్టీ చేపట్టిన కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేస్తామని తెలిపారు. అనంతరం మహాసభల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, పుప్పాల సత్యనారాయణ, పచ్చల శివాజీ, బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జంగాల అజయ్‌కుమార్, నాయకులు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మార్టూరు: మార్టూరులో సోమవారం సాయంత్రం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక గొట్టిపాటి హనుమంతరావు కాలనీ సమీపంలోని పొలాల్లో సుమారు 45 సంవత్సరాల వయసు గల పురుషుడి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించిన పోలీసులు మృతుడు ఇతర రాష్ట్రాలకు చెందిన గ్రానైట్ కార్మికునిగా భావించి ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

- రూ. 10.37 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్‌నాయక్

బాపట్లటౌన్: రెప్పపాటులో సొమ్ము, నగలు, వస్తువులు స్వాహా చేసే ఘరానా దొంగను ఎట్టకేలకు సీసీఎస్ పోలీసులు అరెస్ట్‌చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.10.37 లక్షల విలువచేసే సొమ్మును రికవరీ చేశారు. సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్ వివరాలను వెల్లడించారు. బాపట్ల మండలం, మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం జగదీష్ నర్సింగ్ పూర్తి చేసి ఉద్యోగం రాకపోవడంతో పొలం పనులకు వెళుతూ జీవనం సాగిస్తుండేవాడు. జల్సాలకు అలవాటిన జగదీష్.. పొలం పనుల ద్వారా వచ్చే సొమ్ము జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు పాల్పడడం అలవాటుగా మార్చుకున్నాడు. బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతూ రూ.లక్షల విలువ చేసే బంగారం, టీవీలు, ల్యాప్‌ట్యాప్‌ల దొంగతనాలను పాల్పడుతున్నారు. అతని కదలికలపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టిన సీసీఎస్ పోలీసులు సోమవారం ఉదయం చాకచక్యంగా అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు .



చోరీ సొత్తు చూపుతున్న సీసీఎస్ డీఎస్పీ

వరుస దొంగతనాలు

బాపట్ల జిల్లా పర్చూరు మండలం, భుషాయపాలెంలోని ఓ గృహంలో రూ. 15 వేలు విలువచేసే శామ్‌సంగ్ ఎల్ఈడీ టీవీ, వీవో సెల్‌ఫోన్, ఏటీఎం కార్డులను నిందితుడు దొంగిలించాడు.

- పర్చూరు మండలం, కొమరనేనివారిపాలెం గ్రామంలోని ఓ గృహంలో నల్లపూసల దండ, 2 ఉంగరాలు, లాకెట్, వీయూ ఎల్ఈడీ టీవీ
- బాపట్ల మండలం, పూండ్ల గ్రామంలోని ఇంటిలో బంగారం చైన్, సెల్‌ఫోన్
- గుంటూరు జిల్లా కాకుమాను మండలం, పాండ్రపాడు గ్రామంలోని ఓ గృహంలో బంగారం చైన్, రూ.8 వేలు నగదు, మొబైల్.
- కాకుమాను మండలం, కొమ్మూరు గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం, హెల్త్‌సెంటర్‌లో కంప్యూటర్, ప్రింటర్.
- గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండల పరిధిలో రెండు ల్యాప్‌టాప్‌లు దొంగిలించాడు.

రూ. 10.37 లక్షల విలువైన సొమ్ము రికవరీ

నిందితుడి వద్ద నుంచి రూ. 6.50 లక్షల విలువ కలిగిన బంగారపు నగలు, రూ. 1.20 లక్షల విలువ కలిగిన 10 సెల్‌ఫోన్లు, రూ.1.20 లక్షల విలువ కలిగిన 3 ల్యాప్‌టాప్‌లు, రూ. 30 వేల విలువ కలిగిన ట్యాబ్, రూ. 80 వేల విలువ కలిగిన ఎల్ఈడీ టీవీలు, రూ. 7 వేల విలువ కలిగిన కలర్ ప్రింటర్, రూ. 30 వేలు విలువ కలిగిన హెచ్‌పీ కంపెనీ కంప్యూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందికి ఎస్పీ అభినందన

కేసుల ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ పి.ప్రేమయ్య, సీసీఎస్ ఎస్ఐ స్వర్ణ రవిప్రకాష్, సీసీఎస్ ఎస్ఐ బి.రాంబాబు, సీసీఎస్ కానిస్టేబుళ్లు ఎస్.కోటేశ్వర రెడ్డి, డి.వై.దాసు, కె.చిరంజీవి, ఆర్. వెంకట కృష్ణలను ఎస్పీ తుషార్‌డూడీ ప్రత్యేకంగా అభినందించారు.

చిన్నారి చేతులు కాల్చిన నానమ్మపై కేసు

పట్నంబజారు: మనవడి చేతులు కాల్చిన నానమ్మపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెహ్రూనగర్‌లో నివాసం ఉండే జయలక్ష్మికి ముగ్గురు కుమారులు. ఆఖరి కుమారుడు సాయివీరప్రసాద్‌కు వివాహమైంది. ఇతనికి ఒక కుమార్తె, 18 నెలల కుమారుడు ఆజాద్‌మురగన్ ఉన్నారు. ఈ నెల 17వ తేదీన పిల్లల్ని చూడాలని వీరప్రసాద్‌కు చెప్పటంతో నానమ్మ ఇంట్లో వదలివెళ్లాడు. సాయంత్రం వచ్చి చూసే సరికి చిన్నారి రెండు చేతులు కాలి ఉన్నాయి. వాటర్ హీటర్ కాలిందని అబద్ధం చెప్పటంతో చిన్నారిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చేతులు స్పష్టంగా కాల్చినట్లు గుర్తించారు. ఆజాద్‌మురగన్ పుట్టిన కొద్దిరోజులకే అతని పెద నాన్న మృతి చెందాడు. అప్పటి నుంచి అత్తాకోడలు మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో వారు వేరుగా ఉంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని నానమ్మ ఈ దారుణానికి పాల్పడిందని పోలీసులు గుర్తించారు. చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేట మండలంలోని కుదిరి వద్ద రోడ్డు ప్రమాదంలో తెనాలి ప్రాంతానికి చెందిన వంశీ(24) మృతి చెందిన విషయంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై బ్రహ్మనాయుడు సమాచారం మేరకు తెనాలి సమీపంలోని కొల్లూరు ప్రాంతానికి చెందిన వంశీ(24) శ్రీ సిటీలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. తోటి ఉద్యుగులతో కలిసి పులికాట్‌ను సందర్శించి ఆదివారం రాత్రి సూళ్లూరుపేటకు స్కూటీపై తిరిగి వస్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపరీక్షలు కోసం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన సోమవారం మండలంలోని తాటివారిపాలెం గ్రామంలో వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన తొట్టెంపూడి నరసింహారావు (40)కు ఆయన భార్యకు మధ్య వారం రోజులుగా సమీప గ్రామానికి చెందిన ఓ మహిళ విషయంలో గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో నరసింహారావు ఆదివారం రాత్రి బొల్లాపల్లి సాగర్ కాలువ గట్టుపై గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గమనించిన స్థానికులు వారి కుటుంబ సభ్యులకు పోలీసులకు సమాచారం అందించారు. దీంతోపాటు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

- వట్టిచెరుకూరులో 110.2 మి.మీ. వర్షపాతం నమోదు
- సగటు 52.2 మి.మీ.

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఐదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా వట్టిచెరుకూరు మండలంలో 110.2 మిల్లీ మీటర్లు వర్షం కురిసింది. అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 13.6 మి.మీ వర్షం కురిసింది. సగటున 52.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కాకుమాను మండలంలో 86.2 మి.మీ., గుంటూరు తూర్పు 82.4, గుంటూరు పశ్చిమ 80.2, కొల్లిపర 67.4, ప్రత్తిపాడు 55.6, మంగళగిరి 53.6, పెదనందిపాడు 53.6, దుగ్గిరాల 48.6, తాడకొండ 45, పొన్నూరు 40.2, ఫిరంగిపురం 38.4, పెదకాకాని 37.8, చేబ్రోలు 36.8, తుళ్లూరు 36.2, తాడేపల్లి 36.2, తెనాలి మండలంలో 22.8 మి.మీ చొప్పున వర్షం పడింది. జూలై నెల 21వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 117.7 మి.మీ కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 145.2 మి.మీ వర్షపాతం నమోదైంది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు ఖరీఫ్ పంటల సాగు పనులు ముమ్మరం చేశారు.

జాతీయ ఈత పోటీలకు వడ్డేశ్వరం బాలికలు

తాడేపల్లి రూరల్: ఆగస్టులో జరగున్న జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన బాలికలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.సుబ్బారావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 19, 20 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ అమ్యెచూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన సబ్ జూనియర్ కేటగిరిలో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్‌కె నస్రీన్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, 200 మీటర్ల బటర్‌ఫ్లై లలో మొదటి స్థానం, 100 మీటర్ల బటర్ ఫ్లైలో ద్వితీయ స్థానంలో, 200 మీటర్ల పాడ్యవల్ మెడ్లిలో మూడవ స్థానంలో నిలిచిందని తెలిపారు. నస్రీన్ 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో మొదటి స్థానంలో నిలిచి ఆగష్టు 4,5 తేదీల్లో బెంగళూరులో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడాకారులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.జోజప్ప, వ్యాయామ శిక్షకులు మెల్లెంపూడి రవి, నూతక్కి రవి, ఉపాధ్యాయులు చావా శ్రీనివాసరావు, విజయకుమారి తదితరులు అభినందించారు.



వివాహిత అనుమానాస్పద మృతి

మార్టూరు: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని బబ్బేపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం విప్పర్ల గ్రామానికి చెందిన పఠాన్ మీరాబీ (25)కి బబ్బేపల్లికి చెందిన పఠాన్ కరీముల్లాతో నాలుగు నెలల కిందట వివాహం జరిగింది. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మీరాబీ బబ్బేపల్లి గ్రామంలోనే ఉంటున్న తన అక్క ఇంట్లో వారం రోజులుగా ఉంటోంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కరీముల్లా మీరాబి అక్క నివాసానికి వెళ్లి తన భార్యను సరిగ్గా చూసుకుంటానని నమ్మించి ఇంటికి తీసుకువచ్చాడు. అనంతరం మార్టూరులోని గొట్టిపాటి హనుమంతరావు కాలనీలో జరిగిన ఓ ఫంక్షన్‌కు ఇద్దరూ హాజరై తిరిగి వచ్చారు. అనంతరం భార్యాభర్తల మధ్య గొడవ జరగగా కరీముల్లా కొంతసేపటికి ఇంటికి తలుపు వేసి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి 6 గంటల ఇంటికి వచ్చి తలుపు తీసి చూసిన మీరాబీ తమ్ముడు అచేతనంగా నేలపై పడి ఉన్న అక్కను చూసి కేకలు వేసి స్థానికులను పిలిచాడు. సమాచారం అందుకున్న పోలీసులు మీరాబి మృతి చెందిందని గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సోమవారం నిందితుడు కరీముల్లాను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా తన భార్య మీరాబీని తనే హత్య చేసినట్లు అంగీకరించినట్లు సమాచారం.



పఠాన్ మీరాబీ మృతదేహం